నిరుపయోగంగా ఎత్తిపోతల పథకాలు

- స్వల్ప మరమ్మతులతో నిలిచిపోయిన యంత్రాలు
- నీటి పంపింగ్ లేక ఎండిపోయిన రిజర్వాయర్లు
- ఆవేదన చెందుతున్న రైతులు

కోసిగి: ఎల్లెల్సీ చివరి ఆయకట్టు భూములకు పుష్కలంగా సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలకు మోక్షం కలిగించాలని రైతులు కోరుతున్నారు. కోసిగి మండలంలో గురు రాఘవేంద్ర ప్రాజెక్టులో భాగంగా తుంగభద్ర నది తీరాన మూగలదొడ్డి, దుద్ది ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు. వీటి ద్వారా నదిలో ప్రవాహం ఉన్న సమయంలో నీటిని రిజర్వాయర్లలోకి పంపింగ్ చేయాల్సి ఉంది. అయితే ఎత్తిపోతల పథకాలు సక్రమంగా పనిచేయకపోవడంతో రిజర్వాయర్లు నీరు లేక బోసిపోతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో రిజర్వాయర్ల పరిధిలో పంట పొలాలను సాగు చేసుకున్నారు. అయితే మండలంలోని రిజర్వాయర్లలో నీరు లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షకాలం కావడంతో తుంగభద్ర నదిలో ఓ మోస్తరుగా నీటి ప్రవాహం కొనసాగుతోంది. అధికారులు చర్యలు చేపట్టి ఎత్తిపోతల పథకాల మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేయాలని రైతులు కోరారు.

మూగలదొడ్డి రిజర్వాయర్ దుస్థితి

మూగలదొడ్డి రిజర్వాయర్ నుంచి ఎల్లెల్సీ ఆయకట్టు కింద 3700 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందులో మూగలదొడ్డి, చిర్తనకల్లు, సాతనూరుకొట్టాల, జంపాపురం, ఐరన్‌గల్లు గ్రామాల రైతుల పంట పొలాలకు సాగునీరు అందుతోంది. రెండు మోటార్ల ద్వారా సాగునీటి పంపింగ్ చేసేవారు. అయితే మూగలదొడ్డి పంప్‌హౌస్ వద్ద భద్రత కొరవడడంతో ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ మోటార్లు, అందులోని రాగి తీగను అపహరించేందుకు ప్రయత్నించారు. అక్కడి రైతులు అప్రమత్తం కావడంతో చోరీ జరగకుండా నియంత్రించగలిగారు. అయితే పంప్ హౌస్ మోటార్లు మైనర్ రిపేర్లు ఉన్నాయని, అధికారులు వాటిని పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరమ్మతులు చేసేదెప్పుడు నీటిని పంపింగ్ చేసేదెప్పుడూ అంటూ రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టి విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేయించి నీటితో రిజర్వాయర్లను నింపి సకాలంలో సాగునీటిని అందించాలని కోరుతున్నారు.


తుంగభద్ర నది ఒడ్డున ఏర్పాటు చేసిన మూగలదొడ్డి పంప్‌హౌస్


నీరు లేక బోసిపోయిన దుద్ది రిజర్వాయర్


పంప్‌హౌస్‌లోని విద్యుత్ మోటార్

దుద్ది రిజర్వాయర్

దుద్ది రిజర్వాయర్‌ను 3200 ఎకరాల ఆయకట్టు భూములలకు సాగునీటిని అందించేలా నిర్మించారు. మండలంలోని దుద్ది, కొల్మాన్‌పేట, సజ్జలగుడ్డం, కోసిగి, దేవరబెట్ట, డి.బెళగల్ గ్రామాల వరకు సాగునీటిని అందించాల్సి ఉంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో చుక్క నీరు లేక బోసిపోతోంది. పంప్‌హౌస్ నుంచి నీటిని పంపింగ్ చేసి రిజర్వాయర్‌ను నింపి ఖరీఫ్‌లో సాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

ప్రతిపాదనలు పంపాం

మూగలదొడ్డి పంప్‌హౌస్ వద్ద మోటార్లకు మైనర్ రిపేర్లు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేయిస్తాం. డ్యామ్ నుంచి తుంగభద్ర నదికి నీరు చేరిన వెంటనే పంపింగ్ చేపట్టి రిజర్వాయర్లు నింపుతాం. పంప్‌హౌస్‌ల వద్ద భద్రత దృష్ట్యా రాత్రివేళ వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేశాం. రైతులకు ఖరీఫ్‌లో సకాలంలో సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటాం. – మురళీ, ప్రాజెక్ట్ డీఈ

సాహిత్యం జీవితాన్ని ఉన్నతీకరిస్తుంది


అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్‌ను సన్మానిస్తున్న రచయితలు

ఆదోనిసెంట్రల్: సాహిత్యం జీవితాన్ని ఉన్నతీకరిస్తుందని అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక అక్షరశ్రీ కళాశాలలో 'యువత సాహిత్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సభకు కె.ప్రహ్లాద అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన వల్లూరు శివప్రసాద్ ప్రసంగించారు. నేటి విద్యార్థులు, యువకుల్లో శాస్త్రీయ దృక్పథం కొరవడుతోందన్నారు. సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ద్వారా వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. మత విద్వేషాల పట్ల, రాజకీయ అవినీతిపై యువత ప్రశ్నించాల్సిన అవసరాన్ని సాహిత్యం నొక్కి చెబుతుందన్నారు. ఈ సందర్భంగా అతిథి శివప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ప్రముఖ కవయిత్రులు స్వయంప్రభ, నాగజ్యోతి, కవికేసి మల్లికార్జున, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ జి.వీరచంద్రయాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు, నాగేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా ద్వాదశి వేడుకలు


విశేష అలంకరణలో రాఘవేంద్రుల మూలబృందావనం

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో ద్వాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో బుధవారం వేకువజామున 5 గంటల నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. ద్వాదశి సందర్భంగా రాఘవేంద్రుల మూలబృందావనానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం బంగారు కవచం, పుష్పాలతో విశేషంగా అలంకరించి హారతులు పట్టారు. విశిష్ట అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మంగళవారం ఏకాదశి సందర్భంగా అర్చకులు, సేవా భక్తులు ఉపవాస దీక్షలో కొనసాగారు. ద్వాదశిని పురస్కరించుకుని ఉదయం 8 గంటల నుంచే అన్నప్రసాద వితరణ చేపట్టారు. మఠం మేనేజర్ శ్రీనివాసరావు నేతృత్వంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కకు నీరు పోస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: ప్రతిఒక్కరూ తమ ఇళ్ల వద్ద, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటి సంరక్షిస్తే పర్యావరణాన్ని పరిరక్షించిన వారవుతారని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద డీఈ మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన మొక్కలు నాటారు. కమిషనర్ మాట్లాడుతూ భావితరాలకు చెట్లు ఎంతో ఉపయోగపడనున్నాయని ఇందుకు ప్రతిఒక్కరూ మొక్కలను పెంచాలని సూచించారు. ఏఈలు శరత్‌చంద్ర, మధన్, మున్సిపల్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ తాలూకా అధ్యక్షుడు మునిస్వామి

గోనెగండ్ల: నీట్, యూజీసీనెట్ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ 4వ తేదీన చేపట్టబోయే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు మునిస్వామి, రంగస్వామి, మనోహర్ పిలుపునిచ్చారు. బుధవారం గోనెగండ్లలో ఆయా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. దీంతో లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని పేర్కొన్నారు. నీట్ యూజీసీ నెట్ పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, అలాగే ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు ప్రకాష్, జలీల్, ఖాసీం, వలి, నారాయణ, రమేష్, అభినందన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న సర్పంచ్ పాల్‌దినకర్

కౌతాళం: గ్రామంలో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించుకుందామని కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్ పిలుపునిచ్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి శివప్ప అధ్యక్షతన గ్రామసభను బుధవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలను పంచాయతీ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆయా కాలనీ వాసులు పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

పెద్దకడబూరు: గత నాలుగేళ్లుగా తమ పొలం బీడుగా ఉండేందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఉప్పర లక్ష్మీకాంత్, రామలింగప్ప, చిన్న ఈరన్న కోరారు. వారు బుధవారం తహసీల్దారు కార్యాలయం ఆవరణలో మాట్లాడుతూ.. తమ దాయాదులు ఉప్పర శివన్న, ఆయన కుమారుడు ఈరన్నకు పెద్దకడబూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 558, 566, 120సి, 68ఏ/2లలో మొత్తం 1.44 ఎకరాలు వాటా రాగా సొంత అవసరాల నిమిత్తం 18 ఏళ్ల కిందట అమ్ముకున్నారన్నారు. ఇప్పుడు పొలాన్ని తిరిగి పొందాలన్న దురుద్దేశంతో రెవెన్యూ శాఖలో అర్జీలు సమర్పించి, దొంగ డాక్యుమెంట్లు సృష్టించి కోర్టుకు వెళ్లారని, కేసులు పెట్టారని వాపోయారు. అధికారులు భూ రికార్డులను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

వైభవంగా విజయీంద్రతీర్థుల మధ్యారాధన


విజయీంద్రతీర్థుల మూల బృందావనానికి హారతులు పడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: మధ్వమతం, రాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతి విజయీంద్రతీర్థుల మధ్యారాధన వేడుకలు బుధవారం కనుల పండువగా సాగాయి. తమిళనాడులోని కుంభకోణంలో వెలసిన విజయీంద్ర తీర్థుల మూల బృందావనానికి శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష పంచామృతాభిషేకం, కనకాభిషేకం, పుష్పార్చన గావించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య విజయీంద్రతీర్థులు ఆరాధనతో పాటు, రాములోరి సంస్థాన పూజలు చేపట్టారు. పూజోత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మధ్వ మత ప్రచారంలో చేసిన సేవలను భక్తులకు ప్రవచించారు. బ్రాహ్మణ సంతర్పణతోపాటు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

గోనెగండ్ల: వెల్దుర్తి మండలంలోని రత్నపల్లి గ్రామంలో నిరుపేద దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ పార్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రత్నపల్లి గ్రామానికి చెందిన దళితులు గురిగింజ అనుమక్క, రామాంజినేయులు, పెద్ద రాముడులను అదే గ్రామానికి చెందిన అధిపత్య వర్గాల వారు కులం పేరుతో దూషిస్తూ విచక్షణారహితంగా దాడి చేయడంతో అనుమక్కకు తీవ్ర గాయాలై కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందారని, ఈ ఘటన జరిగి 14 రోజులైనా ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కేవీపీఎస్ నాయకులు మునెప్ప, హనుమన్న, అహమ్మద్, రాముడు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: రత్నపల్లెలో దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంటోని, మండల అధ్యక్ష, కార్యదర్శులు చెన్నప్ప, తిమ్మన్నలు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీ శ్రీదేవికి వినతిపత్రం ఇచ్చారు.

కోసిగి: నిరుపేద దళితులపై దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ మురళీని కలిసి వినతి పత్రం అందజేశారు.

7న జెండావిష్కరణ కార్యక్రమాలు

ఆదోని రూరల్: ఈనెల 7వ తేదీన ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ పండగను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎస్.నాగప్ప మాదిగ, మాదాసు జగన్ మాదిగ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీన దండోరా పండగను ప్రపంచానికి చాటుదామని, ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎమ్మార్పీఎస్ సిద్ధాంతాలు, మాదిగల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రతిఒక్కరూ పాల్గొని దండోరా పండగను ఘనంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు పీఎస్ వీరేష్, పట్టణాధ్యక్షులు గుమ్మల బాలస్వామి, బైచిగేరి తిమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చెరువుల పనులపై సమీక్ష


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోని టౌన్: ఆదోని పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే బసాపురం ఎస్ఎస్ ట్యాంకు, రాంజల నల్లచెరువుల అభివృద్ధి పనులపై అధికారుల సమీక్ష జరిగింది. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పబ్లిక్ హెల్త్ ఈఈ చంద్రమోహన్, మున్సిపల్ వాటర్ వర్క్స్ ఎంఈ చలపతిరావు, ఏఈలు రాజశేఖర్‌రెడ్డి, కృపాకర్‌లతో చర్చించారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు దాదాపు 100 మీటర్ల మరమ్మతు పనులు ఆగిపోయాయని, తద్వారా నీటి పంపింగ్‌లో పూర్తిస్థాయిలో చెరువును నింపుకోలేక పోతున్నామని వాటర్ వర్క్స్ అధికారులు కమిషనర్, పబ్లిక్ హెల్త్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. చెరువుకట్ట మరమ్మతులపై పూర్తిస్థాయిలో సమీక్షించి త్వరితగతిన మరమ్మతు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. రాంజల నల్లచెరువులో పాచిపట్టి రంగుమారిన నీటిని త్వరితగతిన చెరువు నుంచి బయటకు పంపింగ్ చేసి వర్షాలు కురిసినప్పుడు నీటిని నిల్వ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలో పూర్తిస్థాయిలో సక్సెస్ కావాలన్నారు. ఆదోని పట్టణానికి తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

ఆదోని సెంట్రల్: ఆదోని నియోజకవర్గం ఎస్సీ, బీసీ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ (ఏఎస్‌డబ్ల్యూఓ)గా కే. బాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్సీ ఏఎస్‌డబ్ల్యూఓగా పని చేస్తున్న సుధాకర్ బాబు ఈ నెల 30వ తేదీన పదవీవిరమణ పొందారు. బీసీ ఏఎస్‌డబ్ల్యూఓగా పని చేస్తున్న లక్ష్మీనారాయణ గత నెలలో సస్పెన్షన్‌కు గురికావడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో వసతి గృహాల సంరక్షణ, ప్రవేశాలు వంటి వాటికి ఆటంకం కలగకూడదని పత్తికొండలో పని చేస్తున్న కే.బాబుకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అధికారులు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన వసతి గృహాల వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థుల రెన్యూవల్ గురించి అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో ప్రవేశాలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా చేరే విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనాలకు ప్రత్యామ్నాయంగా అద్దె భవనాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వసతి గృహాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. వసతి గృహాల వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.


వసతి గృహాల వార్డెన్లతో మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఓ కే.బాబు

ముగ్గురిపై కిడ్నాప్ కేసు నమోదు

ఆదోని అర్బన్: వివాహిత మహిళను కిడ్నాప్ చేశారని భర్త హనుమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిరంజీవి, ఆయన బాబాయిలు రామంజి, దేవాలపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ నరసింహరాజు బుధవారం తెలిపారు. గత 20 రోజుల క్రితం హనుమయ్య తన భార్య మిస్సింగ్ అయ్యిందని ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో సోమవారం పోలీసులు కిడ్నాప్ చేసిన చిరంజీవి, కిడ్నాప్‌కు గురైన వివాహిత మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించడం జరిగిందన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

కోసిగి: స్థానిక ఉరుకుంద ఆర్చ్ సాయిబాబా నగర్ కాలనీలో నివాసం ఉంటున్న అరికెర నరసప్ప, దళవాయి గోవిందుకు చెందిన ఇళ్లల్లో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. కుటుంబసభ్యులు ఇళ్లకు తాళాలు వేసి వివిధ పనులకు వెళ్లిపోగా దీన్ని ఆసరాగా తీసుకున్న గుర్తు తెలియని దుండగులు ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. బీరువా తలుపులు పగులగొట్టి అరికెర నరసప్ప ఇంట్లో రూ.50 వేల నగదు, తులం బంగారం, గోవిందు ఇంట్లో రూ.20 వేల నగదు, వెండి గొలుసులు, వడ్డానం దోచుకెళ్లారు. దీనిపై బాధితులు కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నందవరం: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మురుగు కాలువలను శుభ్రం చేయాలని, చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుడంతో ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

నందవరం: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్లు ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తిమ్మారెడ్డి కుంట, పూలచింత రిజర్వాయర్‌ను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ..మండల కేంద్రంలో నీటి సమస్యకు తావులేకుండా పూలచింత రిజర్వాయర్ నుంచి నూతన పైపులైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. అలాగే తిమ్మారెడ్డి కుంట నుంచి మరో పైపులైన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్ ద్వారానే విద్యుత్ బిల్లులు చెల్లించాలి

ఆదోని అర్బన్: ఇకపై 'హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌పీడీసీఎల్.ఇన్' వెబ్‌సైట్ నుంచే వినియోగదారులు విద్యుత్ బిల్లులను చెల్లించాలని ఏడీఈ పురుషోత్తం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఇకపై ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌లో నేరుగా బిల్లులు చెల్లించేందుకు అవకాశం ఉండదన్నారు. తమ వెబ్‌సైట్ నుంచి గానీ లేదా బిల్ డెస్క్, ఏపీ ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చన్నారు. గూగుల్ ప్లేస్టోర్లోకి వెళ్లి ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డు, ద్వారా బిల్లులు చెల్లించవచ్చన్నారు. వినియోగదారులు గమనించాలని సూచించారు.

అప్రెంటిస్ విధానం రద్దు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ఇచ్చి, అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ, గోట్ల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని బాలికల జెడ్పీ హైస్కూల్‌లో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం అప్రెంటిస్ విధానాన్ని తొలగించి డీఎస్సీ నిర్వహించాలన్నారు. 117 జీఓను రద్దు చేసి 1998, 2018 డీఎస్సీ ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్ నుంచి విముక్తి కల్పించి రెగ్యులర్ ఉపాధ్యాయులుగా నియమించాలని కోరారు. డీటీఎఫ్ నాయకులు కిరణ్, వీరన్న, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణను అడ్డుకోండి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక కర్నూలు రోడ్డులోని హిందూ శ్మశాన వాటిక స్థల ఆక్రమణను అడ్డుకొని, అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలుకుల సంఘాల నాయకులు బతకన్న, గణేష్, నారాయణ, బజారి, పెద్దయ్య, రంగన్న, రామస్వామి కోరారు.ఈ మేరకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శ్మశాన వాటిక ప్రహరీ, మౌళిక వసతులు కల్పించాలని కోరారు.

అధికారులు మొద్దునిద్ర వీడాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని, మత్తు వదిలి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఐదు సంవత్సరాల్లో రెండు తారు రోడ్లు వేశామని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నారు. పంచాయతీరాజ్‌శాఖతో పాటు మండల పరిషత్ అధికారులు సమస్యల పరిష్కారంలో చాలా వెనకబడ్డారని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద ఎంత నిధులు వచ్చాయి, ఎంత ఖర్చు పెట్టారో తెలపాలని, అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు నెలల్లో గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం సూచించిన సమస్యలను తదుపరి సమావేశం నాటికల్లా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ కొండన్న, డిప్యూటీ తహసీల్దార్ రఘువీరా తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ అభివృద్ధితో పాటు సుందరీకరణకు తగిన ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి స్థానిక అన్నమయ్య సర్కిల్‌లో 'ఐ లవ్ ఎమ్మిగనూరు' అక్షర కూర్పుతో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ సైన్‌బోర్డ్‌ను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, ఏఈలు మదన్, శరత్‌చంద్రతో పాటు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



అన్నమయ్య సర్కిల్‌లో 'ఐ లవ్ ఎమ్మిగనూరు' ఎల్‌ఈడీ సైన్ బోర్డును ప్రారంభించిన దృశ్యం

మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి

ఆదోని అర్బన్: రాయలసీమలోనే అతిపెద్దదైన ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ, జనసేన నాయకులు భూపాల్‌చౌదరి, గుడిసె కృష్ణమ్మ, మల్లప్ప పాల్గొన్నారు. కమీషన్ ఏజెంట్లు యార్డులోని సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. యార్డులో వర్షపు నీరు నిలుస్తున్నాయని, పత్తి టీఎంసీ యార్డులో సగం వరకు పైకప్పు వేసి వదిలిపెట్టారని చెప్పారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సమస్యతోపాటు కమీషన్ ఏజెంట్లకు టీడీఎస్‌తో ఇబ్బందులు ఉన్నాయని వివరించారు. అలాగే 470 మంది గుమస్తాలు ఉన్నారని, వారికి ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెండో ముంబాయిగా పేరుగాంచిన ఆదోనిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. యార్డులో పది చోట్ల తాగునీరు ఏర్పాటు చేస్తానని, అధికారులతో చర్చించి ఇతర సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. యార్డు సెక్రటరీ రామ్మోహన్, అధికారులు, అసోసియేషన్ సభ్యులు, గుమస్తాలు, కమీషన్ ఏజెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

బంగారు దుకాణదారుల అసోసియేషన్ సమావేశం

పట్టణంలోని షరాఫ్‌బజార్ బంగారు దుకాణదారుల అసోసియేషన్ ఆత్మీయ సమావేశం స్థానిక పేట వీరభద్రస్వామి ఆలయంలో జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు ఆపద ఉందని, సెక్యూరిటీ పెంచుకోవాలని, ఇంటెలిజెన్స్ వారు ఫోన్ చేసినట్లు తెలిపారు. తనకు ఏ ఆపద వచ్చినా అభివృద్ధి చేసి తీరుతానని చెప్పారు. షరాఫ్ బజార్‌లో రోడ్డు వెడల్పునకు, అక్రమ కట్టడాల తొలగింపునకు అందరూ సహకరించాలని కోరారు.

టీచ్ టూల్‌తో బోధనా నైపుణ్యం మెరుగు


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు

ఎమ్మిగనూరుటౌన్: టీచ్ టూల్ శిక్షణతో ఉపాధ్యాయుల్లో వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చని ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర పరిశీలకులు వి.శారద దేవి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఏపీ సాల్ట్ ప్రోగ్రాంలో ఏపీ సమగ్ర శిక్ష, ఎస్‌ఈఆర్‌టీ ఆధ్వర్యంలో భాగంగా ప్రపంచ బ్యాంక్ డిజైన్ చేసిన టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు కేంద్రాల్లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కాలానుగుణంగా బోధనా పద్ధతుల్లో నూతన మార్పులు రానున్నాయని, ఆ మేరకు ఉపాధ్యాయులు నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెద్దకడుబూరు, గోనెగండ్ల, నందవరం మండలాల్లో ఎంపిక చేయబడిన ఉపాధ్యాయులు 9 రోజుల శిక్షణలో తప్పకుండా భాగస్వాములు కావాలని సూచించారు. శిక్షణ అనంతరం టీచ్ ప్రైమరీ, టీచ్ సెకండరీ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సిఉందన్నారు. తద్వారా ఐదు మండలాల్లో 95 మంది టీచ్ అబ్జర్వర్లు అవుతారని పేర్కొన్నారు. కోర్స్ డైరెక్టర్ రమేష్‌నాయుడు, హెచ్‌ఎం కృష్ణమూర్తి, మాస్టర్ ట్రైనర్లు రామకృష్ణుడు, పుల్లన్న, శ్రీనివాసులు, కృష్ణమాచారి, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు
97054 44304 (ఆదోని)
70750 09147 (ఎమ్మిగనూరు, మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com